సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ❘ 21 ❘ జూన్ ❘ 2024



జీవన 'యోగ'ం
భారతదేశంలో మొదలైన యోగ ప్రపంచ దేశాలకు విస్తరించింది. ఉమ్మడి జిల్లాలో యోగ అభ్యాసకుల సంఖ్య పెరుగుతోంది. నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం.

8లో ▶

చైర్మన్ నియామకంపై పునరాలోచించాలి
చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ చైర్మన్ నియామకంపై పునరాలోచించాలని ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాధనబోయిన కృష్ణ తెలిపారు. రాష్ట్రంలో సుమారు 5000 మత్స్య సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 4300 సంఘాలు ముదిరాజ్ కులస్తులు ఉండగా కేవలం 700 సంఘాలు ఉన్న గంగపుత్రులకు చైర్మన్ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మెజార్టీ సంఘాలు ఉన్న ముదిరాజ్ కులస్తులకు చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

బెల్లంపల్లికి సబ్‌కలెక్టర్ హోదా
- ఉమ్మడి జిల్లాలో మరో మూడు..
- భైంసా, ఉట్నూర్, కాగజ్‌నగర్‌కు కూడా..
- ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లికి సబ్ కలెక్టర్‌స్థాయి హోదా దక్కాయి. ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ కేడర్ అధికారిని నియమించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్లకు గాను ఇప్పటి వరకు ఆర్డీవో స్థాయి అధికారి ఉండగా, ఇకపై ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండనున్నారు. పరిపాలన ఆవశ్యకతలో భాగంగా రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లలో ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించడానికి ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం ద్వారా జీవో 834ను తేదీ 13.06.2024న జారీ చేసింది.

ఆ టీచర్ డిప్యూటేషన్ రద్దు
- 'సాక్షి' కథనానికి స్పందన


EDUCATION DEPARTMENT

డీఈవో యాదయ్య జారీ చేసిన ఉత్తర్వు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎట్టకేలకు ఆ ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దయింది. ఈ నెల 19న 'ఏంటి గురూ.. ఇదీ!' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాండూరు జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఉంటూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.భరత్‌కుమార్ డిప్యూటేషన్ రద్దు చేస్తూ మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి వినతి మేరకు రెండుసార్లు డిప్యూటేషన్ పొడగించామని, తాండూరు స్కూల్‌లో ఆయన సేవలు అవసరమని వెంటనే ఆ ఉపాధ్యాయుడి రిలీవ్ చేయాలంటూ కోరారు. మరోవైపు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న ప నుల్లో కమీషన్ల కోసమే ఇన్నాళ్లు డిప్యూటేషన్‌ను ఉన్నతాధికారులు పొడగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఎంఆర్‌సీలోకి ఎంపీడీఓ కార్యాలయం
భీమిని: కన్నెపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయం స్థానిక ఎంఆర్‌సీ భవనంలోకి గురువారం మార్పు చేశారు. గత మూడేళ్లుగా ఎంపీడీఓ కార్యాలయం కన్నెపల్లిలోని ఓ అద్దె భవనంలో కొనసాగింది. బుధవారం ఇంటి అద్దె చెల్లించడం లేదని ఎంపీడీఓ కార్యాలయానికి యజమాని తాళం వేసిన కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో అద్దె భవనం నుంచి ఎంఆర్‌సీ కార్యాలయంలోకి మార్చుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ గంగామోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.32.10లక్షలకు మేకల సంత వేలం


వేంపల్లి పంచాయతీలో మేకల సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మేకల సంత నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. బహిరంగ వేలంలో పంచాయతీకి రూ.32.10 లక్షల ఆదాయం సమకూరింది. పోతు గణేశ్, బూంబత్తుల మహేశ్, సాయితేజ మధ్య పోటాపోటీగా వేలం పాటలో సాయితేజ మేకల సంత దక్కించుకున్నాడు. వచ్చే నెల జూలై నుంచి 2025 మార్చి 31 వరకు అంటే 9 నెలలపాటు సంత నిర్వహించుకునేలా అప్పగించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి గంద్ర హరిత, పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ, కారోబార్ తిరుపతి పాల్గొన్నారు.

మా గోడు వింటారా !


లక్సెట్టిపేట-మంచిర్యాల మధ్యనున్న ఎన్‌హెచ్-63


ముల్కల్ల శివారులో మొదటి అలైన్‌మెంటులో బైపాస్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం


ప్రజాభిప్రాయ సేకరణ చేశాకే సర్వే చేపట్టాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న ఈ భూ యజమాని పేరు వొద్నాల శ్యామ్ సుందర్. సింగరేణి కార్మికుడిగా పని చేసి కూడబెట్టిన డబ్బులతో 2005లో హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులో నాలుగెకరాల భూమి కొన్నారు. 'నాలా' పన్ను కట్టారు. తన భూమి నుంచే హైవే బైపాస్ నిర్మాణం కోసం అధికారులు సర్వే చేసేందుకు వస్తే అడ్డుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో మొదటి అలైన్‌మెంటు అనుకూలంగా మార్చేసి, తమలాంటి వారికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నాడు. ఇలా అనేక మంది మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వరకు వందల ఎకరాల్లో భూములు కోల్పోవాల్సి వస్తోంది.

- హైవేకు భూములు ఇచ్చేందుకు ససేమిరా
- మొదటి అలైన్‌మెంటు ప్రకారమే చేపట్టాలని డిమాండ్
- ప్రధాని మోదీ వంద రోజుల ప్లాన్‌లో ఎన్‌హెచ్-63
- గ్రీన్, బ్రౌన్‌ఫీల్డ్‌గా హైవే నిర్మాణానికి కసరత్తు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో ఏళ్లుగా వందలాది మంది రైతులు ప్రజా అవసరాలకు విలువైన భూములు కోల్పోతున్నారు. సింగరేణి కార్యకలాపాలు, జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్లంపల్లి ప్రాజెక్టు, జాతీయ రహదారులు, ప్రైవేటు పరిశ్రమలకు భూములు ఇస్తూ నిర్వాసితులు అవుతున్నారు. కొన్నిసార్లు మెరుగైన పరిహారం పొందగా, చాలాసార్లు నష్టపోయారు. తాజాగా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్(ఛత్తీస్‌గఢ్) మధ్య నిర్మించనున్న ఎన్‌హెచ్-63 నాలుగు వరుసల రోడ్డు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ రోడ్డు నిర్మాణానికి 1250 ఎకరాలు(ఆర్మూర్-మంచిర్యాల) ప్రైవేటు యజమానుల నుంచి తీసుకోవాల్సి ఉంది. మిగతాది రాష్ట్ర పరిధి జాతీయ రహదారుల విభాగం కింద మంచిర్యాల నుంచి కోటపల్లి మండలం ప్రాణహిత తీరం మహారాష్ట్ర సరిహద్దు వరకు పాత రోడ్డునే వెడల్పు చేశారు. ఆర్మూర్-మంచిర్యాల సెక్షన్‌లో 80శాతం గ్రీన్‌ఫీల్డ్.. అంటే పంటపొలాల నుంచి కొత్త రోడ్డు, 20శాతం ప్రస్తుత రోడ్డునే వెడల్పు చేస్తున్నారు. ఎన్‌హెచ్-44కు, ఎన్‌హెచ్-363కి కలిపే నాలుగు వరుసల కంట్రోల్ యాక్సెస్ హైవేతో ప్రయాణం సులువు కానుంది.

రెండు సార్లు డిజైన్ మార్చేసి..
హైవే అలైన్‌మెంటును రెండుసార్లు మార్చడంపై నిర్వాసితులు ఆగ్రహంతో ఉన్నారు. కొందరు రియల్ వ్యాపారులు తమ భూములు, ఆస్తులు కోల్పోకుండా ఏకంగా అలైన్‌మెంటు మార్చేందుకు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ముందున్న ప్రతిపాదన రోడ్డు కాకుండా మరో ప్లాన్ తెరపైకి వచ్చింది. హైవే నిర్మాణంలో కీలకమైన మంచిర్యాల పట్టణ బైపాస్‌లో ముల్కల్ల సమీపంలో ఒర్రె నుంచి మొదట ప్రతిపాదనలు సిద్ధం చేసి, తాజాగా గోదావరి పంపుహౌజ్ కమాన్ సమీపంలో నిర్మాణాల మధ్యలో వెళ్లేలా తుది ప్లాన్‌కు ఓకే చేశారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.2కోట్ల వరకు ఉంటే పరిహారం చెల్లింపులో రూ.కోటిలోపే వచ్చే అవకాశం ఉండడంతో నిర్వాసితులు అభ్యంతరం చెబుతున్నారు. మొదటి ప్లాన్ ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు నిరసనలు చేస్తూ జిల్లా ఉన్నతాధికారులను కలిశారు. తమకు న్యాయం జరిగే వరకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. దీనిపై కేంద్రమంత్రులను కలవాలని ప్రణాళిక వేస్తున్నారు.

మోదీ వంద రోజుల ప్లాన్‌తో వేగం
నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అయ్యాక మొదటి వంద రోజుల్లో చేపట్టాల్సిన పనుల్లో రాష్ట్రం నుంచి ఎన్‌హెచ్-63రోడ్డు ఉంది. ఈ క్రమంలో వచ్చే మూడు నెలల్లో భూ సేకరణ, పరిహారం చెల్లింపు, స్వాధీనం, టెండర్లు ఖరారు, కాంట్రాక్టరుతో నిర్మాణ ఒప్పందం పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎన్‌హెచ్ఏఐ(జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) అధికారులు పనుల్లో వేగం పెంచారు.

ఆర్మూర్-మంచిర్యాల హైవే సెక్షన్ భూ సేకరణ వివరాలు(ఎకరాల్లో)

సేకరించాల్సిన మొత్తం : 1478.77
ప్రభుత్వ : 176.11
ప్రైవేటు : 1259.42
అటవీ : 38.05
ప్రభావితమవుతున్న నిర్మాణాలు : 135
నిర్వాసిత కుటుంబాలు : 162
నిర్మించే రోడ్డు : 131.895కి.మీ
వ్యయం : రూ.2937.36కోట్లు
ముఖ్య పట్టణాలు:
ఆర్మూర్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్సెట్టిపేట, మంచిర్యాల

ఇప్పటికైతే ఏ మార్పులేదు
హైవే నిర్మాణంలో ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేదు. ఈ వందరోజుల్లో పనులు మొదలు కావాల్సి ఉంది. భూసేకరణ, పరిహారం పూర్తి చేయాల్సి ఉంది. వచ్చే నెలలో టెండర్లు పిలుస్తున్నాం. ప్రజా అవసరాల కోసం భూములిచ్చే వారు మెరుగైన పరిహారం పొందవచ్చు.
– కేఎస్.అజయ్ మణికుమార్, పీఐయూ(ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్స్), మంచిర్యాల

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్


జడ్జికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కుమార్ దీపక్ గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానంలోని ప్రత్యేక చాంబర్‌లో కలిసి మొక్క అందజేశారు. అనంతరం జిల్లాలోని నేరాలు, కోర్టు పరిధిలో ఉన్న కేసుల వివరాలు, తదితర అంశాలపై చర్చించారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలపై నిఘా
- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏ.భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన భాస్కర్ 2010 గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. మొదటిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల, తెలంగాణలోని కామారెడ్డి, రామగుండం, 2016 డిసెంబర్ నుంచి 2017 ఏప్రిల్ వరకు ఆసిఫాబాద్ డీఎస్పీగా పని చేశారు. అనంతరం ఇంటిలిజెన్స్ బ్యూరోలో పని చేశారు. 2023లో జగిత్యాల ఎస్పీగా పని చేశారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా పని చేస్తూ డ్రగ్స్ నిర్మూలనకు ఉక్కుపాదం మోపారు.

మొక్కు'బడి బాట'..!


దొనబండ గ్రామంలో బడిబాట కార్యక్రమం(ఫైల్)

- గత ఏడాది కంటే తగ్గిన అడ్మిషన్లు
- ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య 560

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపు లక్ష్యంగా చేపట్టిన బడిబాట మొక్కుబడిగా సాగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 6నుంచి 19వరకు కార్యక్రమం నిర్వహించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పాఠశాల పునః ప్రారంభం కంటే ముందే ఎంతో ఆర్భాటంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఒకట్రెండు రోజులు మినహా మిగతా రోజుల్లో పట్టించుకున్నట్లు కనిపించలేదని తెలుస్తోంది. ఒకటో తరగతిలో ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తగ్గడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

వసతులు పెరిగినా..
ప్రభుత్వ బడుల్లో మునుపటి కంటే వసతులు మెరుగయ్యాయి. మన ఊరు-మనబడి, మన బస్తీ-మన బడి, అమ్మ ఆదర్శ కమిటీలతో మౌలిక వసతులు పెరిగాయి. తెలుగుతోపాటు ఆంగ్ల బోధన జరుగుతోంది. తరగతులు ప్రారంభించిన రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు బడీడు పిల్లలందరికీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట నిర్వహించింది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్కారు బడుల్లో కల్పిస్తున్న వసతులు వివరిస్తూ బడీడు పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిబాట నిర్వహణ కోసం ప్రతీ పాఠశాలలో కరపత్రాలు తయారు చేయించి ప్రచారం చేశారు. ఇందుకు ప్రతీ పాఠశాలలకు రూ.వెయ్యి చొప్పున మంజూరు చేశారు. బడిబాటలో నిర్ణయించిన కార్యక్రమాలను విధిగా నిర్వహించి చివరి రోజు నివేదికలు పంపాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు శ్రద్ధ తీసుకోవాల్సి ఉండగా ఒకట్రెండు రోజులు మినహా మిగిలిన కార్యక్రమాలపై అంతగా దృష్టి సారించలేనట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ బడుల్లో కొత్తగా అడ్మిషన్లు పొందిన ఆన్‌లైన్ వివరాలు ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి	396
ప్రైవేట్ పాఠశాల నుంచి	107
నేరుగా చేరిన వారు	55
బడిబయట పిల్లలు	12
మొత్తం	560

అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు
ప్రభుత్వ బడుల్లో కల్పించిన మౌలిక వసతులు నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అమలు ఆంగ్ల మాధ్యమంలో బోధన నేపథ్యంలో కొత్త అడ్మిషన్లు మరింతగా పెరుగుతాయి. బడిబాటలో కల్పించిన ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇంకా స్కూల్ ఎడ్యుకేషనల్ యాప్‌లో చేర్చాల్సి ఉంది. బడిబాట ముగిసినా ఆగస్టు వరకు అడ్మిషన్లు కొనసాగిస్తాం. పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపడుతాం.
– ఎస్.యాదయ్య, డీఈవో, మంచిర్యాల


బదిలీలు, పదోన్నతులతో..
ఓ వైపు బడిబాట నిర్వహిస్తుండగానే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల కావడంతో బడిబాట నత్తనడకన సాగింది. ఉపాధ్యాయులందరూ ఎవరెవరికి పదోన్నతులు వస్తాయని ఆరా తీయడం.. ఆన్‌లైన్ దరఖాస్తుల నుంచి పదోన్నతుల ఆర్డర్ కాపీలు చేతికి వచ్చేంత వరకు అటువైపు ప్రాధాన్యత ఇచ్చారు. ఇంకోవైపు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సర్టిఫికేట్ల వెరిఫికేషన్లలో మునిగితేలడం కూడా కారణంగా తెలుస్తోంది. ఈలోపు బడిబాట కార్యక్రమం పూర్తయింది. కానీ.. అడ్మిషన్లు అంతంతగానే మారాయి. ఫలితంగా గతేడాది ఒకటో తరగతిలో 1,458 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించగా ఈ ఏడాది 560 మందికి పరిమితం కావాల్సి వచ్చింది.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅర్బన్: పిల్లల్లో రక్తహీనత, వివిధ రకాల అనారోగ్యానికి కారణమవుతున్న నులిపురుగులను నివారించడంతో సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, విద్యార్థులు వారి తల్లిదండ్రులను చైతన్యవంత పర్చాలని అన్నారు. ఏడాది నుంచి 19ఏళ్ల వయస్సు పిల్లలందరితోనూ మాత్రలను వైద్యుల సూచనల మేరకు మింగించాలని తెలిపారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, అల్బెండజోల్ మాత్రలు వేసుకునే పద్ధతులు, నులిపురుగుల నివారణపై పలు విషయాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత క్లుప్తంగా వివరించారు. అంతకుముందు విద్యార్థులు అల్బెండజోల్ మాత్ర వినియోగం, నులిపురుగుల నివారణపై విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ప్రోగ్రాం అధికారి నీరజ, డెమో వెంకటేశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్, డీపీవో ప్రశాంతి, డీపీహెచ్ఎన్ రత్నమాల, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు రాము, రజిని పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పాలనలో గాడితప్పిన ఆర్థిక వ్యవస్థ'


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అవకతవకల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని, దానిని సరిచేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేక ప్రస్తుత ప్రభుత్వ పాలనకు గుదిబండగా తయారైందని వివరించారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 58 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీటీ రవీందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, యువతకు రూ.5 లక్షల విద్య భరోసా కార్డు, నిరుద్యోగ భృతి వంటివి అమలు చేయలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అండతో ఆయన అనుచరులు ఖాళీ స్థలాలు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మంచిర్యాల, అంతర్గాం మధ్య వంతెనను ఎమ్మెల్యే స్వలాభం కోసం మరోచోటుకు మారుస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, బొలిశెట్టి అశ్విన్, బోయిని హరికృష్ణ, రెడ్డిమల్ల అశోక్, రాకేశ్ రెన్వా, పల్లి రాకేశ్, బింగి ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు
బెల్లంపల్లి: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలు, ప్రజాపాలన కౌంటర్‌ను పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో సమావేశం అయ్యారు. ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'నా కోసం- సమాజం కోసం యోగ'
మంచిర్యాలఅగ్రికల్చర్: 'నా కోసం-సమాజం కోసం యోగ' అనే నినాదంతో యోగ దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 21న యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద ఆస్పత్రుల్లో యోగాపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: అవకతవకలు జరిగిన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నీట్‌పై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ఇందుకు ప్రధానమంత్రి మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ రద్దయ్యే వరకు పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు ఈట రాకేష్, అరుణ్‌కుమార్, ప్రణీత్, అరవింద్, అరుణ్‌ప్రసాద్, కుశల్, సురేష్, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి


భీమారంలో మృతిచెందిన పశువులు

భీమారం: మండల కేంద్రంలోని కొత్తగూడెం సమీపంలో ఉన్న బాల్‌రెడ్డి కొట్టం వద్ద బూపల్లి లచ్చన్న, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు పశువులు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి మృతిచెందాయి. మూడు రోజుల క్రితం మేతకు వెళ్లిన పశువులు ఇంటికి రాకపోవడంతో గాలిస్తున్నారు. గురువారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు వెళ్లి చూడగా విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాయి. ఒక్కోదాని విలువ రూ.75 వేలు ఉంటుందని, విద్యుత్‌శాఖ అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన అవదూత భాస్కర్ (30) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కూలీ పనిచేసుకుని జీవించే భాస్కర్ మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నిహారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

తుంపెల్లిలో మహిళపై దాడి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని తుంపెల్లి గ్రామంలో మహిళపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారు. బాధితురాలు పోలవేణి అంకు గురువారం వివరాలు వెల్లడించారు. ఉపాధిహామీ పనులకు వెళ్లి వస్తుండగా ఇంటి సమీపంలో హద్దుల ఏర్పాటు కోసం ఉంచి ఫెన్సింగ్ వైర్‌ను పోలవేణి హనుమంతు తొలగించాడని ఆరోపించింది. అంతేకాక హద్దు లోపల కొత్తగా కర్రలతో దడి ఏర్పాటు చేయడంపై ఇదేంటని ప్రశ్నించానని పేర్కొన్నారు. దీంతో హనుమంతు, అతడి అల్లుడు భావినె పర్వతాలు కర్రలతో దాడి చేశారని ఆరోపించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తన పెద్దకుమారుడు బీరయ్యను సైతం కొట్టి బూతులు తిట్టినట్లు తెలిపింది. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరింది.

పరిహారం పెంచాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

జైపూర్: మండలంలోని నర్వ నుంచి ఎల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కింద నష్టపోతున్న భూములకు పరిహారం పెంచాలని రైతులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. గురువారం భూములు కోల్పోతున్న రైతులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం ఒక్క ఎకరాకు రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు డిమాండ్ ఉందని, క్రయవిక్రయాలు సైతం ఉన్నాయని, రోడ్డులో నష్టపోతున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో వేరోక చోట భూమి కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు.

జీవన 'యోగ'ం


యోగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు తిరుపతిరెడ్డి

- నిత్య సాధనతో ఆరోగ్యం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్/నిర్మల్‌ఖిల్లా: భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. యోగ భారతదేశంలో పుట్టి నేడు ప్రపంచదేశాల్లో కూడా వేగంగా విస్తరించింది. ప్రతి ఒక్కరూ వ్యాయామంలో యోగనే ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అదీ మన భారతదేశ గొప్పతనం. దీన్ని ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 నుంచి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజున దినంలో సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఒక కారణంగా చెప్తారు. మనసును నిగ్రహపరచడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆసనాలు..

వివిధ రకాల ఆసనాల ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రాణాయామం, వృక్షాసనం, వీరభద్రాసనం, పశ్చిమోత్తాసనము, గోముఖాసనము, శీర్షాసనం, పూర్ణ శలభాసనం, చక్రాసనం ఆసనాల ద్వారా రక్తశుద్ధి, నరాలకు బలం చేకూర్చడం, పొట్ట తగ్గడం, బరువు తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని శిక్షకులు సూచిస్తున్నారు.


యోగా నేర్పిస్తున్న సంధ్య బెదోద్కర్


శిక్షణ ఇస్తున్న శిక్షకుడు సంతోష్

ఐదేళ్లప్రాయం నుంచే...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌కు చెందిన ద్యావరశెట్టి చైతన్య తన తండ్రి ప్రభాకర్ చేస్తున్న యోగాసనాలను చూస్తూ పెరిగింది. ప్రభాకర్ నిజామాబాద్‌లో యోగాచార్యులుగా గుర్తింపు పొందారు. ఐదేళ్లకే చైతన్య ఆసనాలు వేయడం ఆరంభించింది. యోగ విద్యలో పట్టు సా.దించడమే కాకుండా పట్టా కూడా పొందేందుకు 2008లో నాసిక్‌లోని యశ్వంత్‌రావు చౌహాన్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ యోగా పూర్తిచేసింది. భర్త ద్యావరశెట్టి వేణుగోపాల్ సహకారంతో ప్రస్తుతం యోగాసాధన కొనసాగిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ పతకాలనూ సాధించింది. మాజీ ఎంపీ మధుయాష్కీ చేతుల మీదుగా ఉత్తమ యోగా ప్రదర్శకురాలిగా అవార్డునూ పొందారు.

ఉచితం.. సమాజ'హితం'..



నిర్మల్‌ఖిల్లా: 2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను.. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగా అలవాటు చేసుకున్నాను. ఆసనాలు, ప్రాణాయామ, సూర్య నమస్కారాలు ప్రతీరోజు రెండు గంటలు చేస్తున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటినుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నేను చేయడమే కాకుండా నా వద్దకు వచ్చే మరో వంద మందికి ఉచితంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోని వశిష్ట యోగా సంఘటన్‌లో ఉదయం శిక్షణ ఇస్తున్నాను. – జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, నిర్మల్

దినచర్యలో ఒక భాగం చేసుకోవాలి



మన దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలి. ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. ఏ వ్యాధికి సంబంధించిందైనా పూర్తిగా అదుపులో ఉంచేందుకు, ఆ వ్యాధులను తగ్గించేందుకు యోగ ఉపయోగపడుతుంది. ధ్యానం, ప్రాణామాయం వంటివి ఒత్తిడిని దూరం చేయడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు సునాయాసంగా చేసేందుకు యోగా ఉపయోగపడడంతోపాటు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. యోగ ఆసనాలను ఇష్టం వచ్చినట్లు వేయకుండా శిక్షకులు చెప్పిన పద్ధతిలో వేయాలి. – గోనె మణిమాల, యోగా శిక్షకురాలు, మంచిర్యాల

విస్తృత ప్రయోజనాలు



యోగా సాధన మనిషి జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తుంది. ఇది కేవలం శారీరక వ్యాయామానికి మాత్రమే పరిమితం కాదు. విస్తృత ప్రయోజనాలు ఉంటాయి. నిరంతర సాధనతో ప్రశాంతత చేకూరుతుంది. తనలోని అంతరంగాన్ని చదివే దిశగా మనిషిని ప్రేరేపిస్తుంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు చేయవచ్చు. ముఖ్యంగా నేటి యువత యోగా సాధన అలవర్చుకోవాలి. – సంధ్య బెదోద్కర్

పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా..



నిత్యజీవితంలో పెరిగిన ఒత్తిడితో పాటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో శారీరక, మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయి. రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధులు అదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో వ్యాధుల నియంత్రణకు, మానసిక దృఢత్వం సాధించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధనతో ప్రతి ఒక్కరిలో ఉత్తేజం నింపుతుంది. శరీరం, మనస్సుపై అదుపు ఏర్పడుతుంది. భారతీయ సంస్కృతి ప్రసాదమైన యోగా పలువురికి నేర్పిస్తుండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. – తిరుపతిరెడ్డి, యోగా శిక్షకుడు, పతంజలి యోగా భవన్

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



యోగాకు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది. దీనిని ఒక క్రీడగా గుర్తించడంతో ఈ కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. భవిష్యత్తులో ఒలంపిక్ క్రీడల్లో సైతం దీన్ని చేర్చి అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్యంతో పాటు ఉపాధి సైతం యోగా ద్వారా సాధ్యమవుతుంది. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాల్లో యోగాను చేర్చడం శుభ పరిణామం. అలాగే పాఠశాలల్లో ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుండడం దీనికి పెరుగుతున్న మద్దతుకు సంకేతంగా నిలుస్తుంది. యోగాతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. – సంతోష్, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్

ఏకాగ్రత పెరుగుతుంది..



చెన్నూర్: వేసవి సెలవుల్లో యోగా నేర్చుకున్నా. యోగా క్లాస్‌ల ద్వారా ఏకగ్రత పెరుగుతుంది. గత ఏడాది నుంచి యోగా శిక్షణ పొందుతున్నా. జ్ఞాపక శక్తి పెరిగింది. ఎండకాలంలో సెలవులను యోగా శిక్షణ తరగతులతో గడిపాను. –బి.రుత్విక్, విద్యార్థి

ఆసనాలు నేర్చుకున్నా..



చెన్నూర్: మొదట యోగా ఆసనాలు వేయాలంటే కష్టంగా ఉండే. ప్రతీరోజు క్లాస్‌లకు వచ్చాను. ప్రస్తుతం నాకు అన్ని రకాల యోగా ఆసనాలు వేయడం వచ్చు. ఎలాంటి ఫీజు తీసుకోకుండా గత నాలుగేళ్ల నుంచి యోగా శిక్షణ ఇస్తున్నారు. –గంగుల జస్విత, విద్యార్థిని, చెన్నూర్

పది మందికి నేర్పించాలని..



చెన్నూర్: నేను నేర్చుకున్న యోగా వృథా కావద్దనే ఉద్దేశంతో పది మందికి నేర్పిస్తున్నా. గత నాలుగేళ్ల నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. ఉదయం ఒక బ్యాచ్, సాయంత్రం ఒక బ్యాచ్ చొప్పున చాలామంది వస్తున్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలి. –మంచాల పద్మజ, యోగా శిక్షకురాలు, చెన్నూర్

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు గైర్హాజరు శాతాన్ని తగ్గించుకొని, హాజరుశాతాన్ని పెంపొందించుకోవాలని శ్రీరాంపూర్ ఎస్‌ఓటు జీఎం వి.పురుషోత్తం రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐకే 1ఏ గనిలో పనిచేస్తూ 2023లో 100మస్టర్లు, 2024 మే వరకు 50మస్టర్లు నిండని కార్మికులకు గురువారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ టు జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ కార్మికుల సౌకర్యార్థం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రతీ కార్మికుడు ప్రతీ నెల 20మస్టర్లు తగ్గకుండా హాజరుకావాలని సూచించారు. కాగా కౌన్సెలింగ్‌కు 70మంది కార్మికులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, అధికారులు చిరంజీవులు, డాక్టర్ పి.రమేశ్‌బాబు, రాజేష్, అజ్మీరా రమేష్, జోతి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేందుకు కృషి


మాట్లాడుతున్న సీతారామయ్య


రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు చేసేందుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా కై రిగూడ ఓసీపీతోపాటు, గోలేటి సీహెచ్‌పీలో గురువారం నిర్వహించిన ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కార్మికుల పిల్లల ఉద్యోగ అర్హతకు 35 సంవత్సరాల వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచడం, గృహ నిర్మాణ రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపులో కాలపరిమితి లేకుండా సమాన వడ్డీ చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం, కార్మికుల పిల్లలకు సీబీఎస్‌సీ విద్య అందించడం వంటి సౌకర్యాలు సాధించామని తెలిపారు. ఈ నెల నుంచి సీఎంపీఎఫ్ అన్ని రకాల లోన్లు వచ్చేలా యాజమాన్యంతో మాట్లాడామన్నారు. ఏరియా ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్, కిరణ్‌బాబు, జగ్గయ్య పాల్గొన్నారు.

కుమురంభీం థియేటర్ వెలవెల


ప్రేక్షకులు లేక ఖాళీగా థియేటర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రజలకు వినోదం పంచేందుకు 2022లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమురంభీం సినిమా థియేటర్ ప్రేక్షకులు రాక వెలవెలబోతుంది. రెండు రోజులుగా ప్రేక్షకులు రాకపోవడంతో కనీసం ఒక్క షో కూడా వేయడం లేదు. టాప్ హీరోల సినిమా వస్తే తప్పా జనాల తాకిడి ఉండే అవకాశం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా.. ప్రస్తుతం జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో ప్రేక్షకులు సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

660 కిలోల బెల్లం పట్టివేత


పట్టుకున్న బెల్లంతో అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని లంబాడిహేటిలో నాటుసారా తయారీ కోసం తరలిస్తున్న 660 కిలోల బెల్లాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం లంబడిహేటి గ్రామంలోని నాటుసారా తయారీదారులకు బెల్లం సరఫరా చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బెల్లం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంతోపాటు బెల్లం స్వాధీనం చేసుకుని లంబాడిహేటికి చెందిన అజ్మీర సీతారాం, సైరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓల్డేజ్ హోంకు వృద్ధురాలి అప్పగింత


ఓల్డేజ్ హోంలో చేరుస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలోని రామకృష్ణాపూర్‌కు చెందిన మేరీ ద్రాక్షవల్లి(70) తనను కొడుకు, ఇద్దరు కూతుళ్లు చూసుకోవడం లేదని జిల్లా మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఆమె కొడుకు, ఇద్దరు కూతుళ్లో మాట్లాడారు. తమ తల్లిని చూసుకోలేమని చెప్పడం, ఆమె కూడా తనను ఓల్డేజ్ హోంలో చేర్పించాలని కోరడంతో గురువారం సఖి వాహనంలో హైదరాబాద్‌లోని గ్రాండ్ మా ఓల్డేజ్ హోంలో చేర్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ పర్వీన, మహిళా సాధికారిక హబ్ జెండర్ కోఆర్డినేటర్ సౌజన్య, టీం లీడర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలి


మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని కొనసాగించడానికి సింగరేణి సీఅండ్‌ఎండీ వెంటనే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. మూసివేతకు గురైన వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏరియా ఆసుపత్రిని మూసి వేసేందుకు యత్నాలు చేయడం సరికాదని, ఆ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికులు బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నారని అన్నారు. ఆసుపత్రిని మూసి వేయడం వల్ల కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్య సేవలు దూరమవుతాయని తెలిపారు. ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రి మూసివేత చర్యలను కార్మికుల మద్దతుతో అడ్డుకుంటామని, తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజ్‌కుమార్, సీనియర్ నాయకుడు చిప్పనర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్, వైస్‌ప్రసిడెంట్ ఎస్.తిరుపతి, నాయకులు డీఆర్.శ్రీధర్, బయ్య మొగిలి, ఆడేపు రాజమౌళి పాల్గొన్నారు.

ఐకే1ఏ గనిని సందర్శించిన నాయకులు


కార్మికులతో మాట్లాడుతున్న వీరభద్రయ్య

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు గురువారం సందర్శించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికులకు మౌలిక వసతులు కల్పించడంలో లేదని, నాణ్యతతో కూడిన పనిముట్లు అందించాలని, వెంటిలేషన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఫిట్‌కార్యదర్శి అరిక రాజయ్య, తదితరులు ఉన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: సంస్థ ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని డీఏంఎస్(మెకానికల్) సుధీర్ గణపతిరావు బన్సరే తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా సీసీసీ సింగరేణి గెస్టుహౌజ్‌లో మ్యాన్‌రైడింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్‌మెంట్, హాలర్స్ పనితీరుపై అధికారులకు ని ర్వహించిన వర్క్‌షాప్‌లో డీఏంఎస్(మెకానిక ల్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఉద్యోగులు సేఫ్టీ మేనేజ్‌మెంటు ప్లా న్ రూల్‌బుక్‌లో తెలియజేసిన విధంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ రక్షణ పరికరాలు ధరించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్‌కుమా ర్ డీడీఎంఎస్(మెకానికల్), కే.గురువయ్య, కా ర్పొరేట్ జీఎం మనోహర్, మందమర్రి జీఎం సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు తోట తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. ఏరియాలోని పాలచెట్టు వద్ద గల ఎంవీటీసీలో శిక్షణ తరగతులకు హాజరై, తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కాలనీలోని రోడ్డు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తిరుపతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు సమాచారం.

గంజాయి మొక్కల స్వాధీనం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేకే–5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన కస్తూరి లింగయ్య ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. 13 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్‌బ్యాగు, స్టేషనరీ అందజేస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, షూ, సాక్స్‌లు, స్కూల్ బ్యాగు అందించాలని ఉపాధ్యాయురాలు చట్టా జ్యోతి ఆలోచన చేసింది. తన సొదరుడు రెవరెండ్ ఫాదర్ రవికుమార్ సెయింట్ పెట్రోనెలా పారిష్ సభ్యుల సహకారంతో సుమారు రూ.5లక్షల విలువైన టై, బెల్ట్ స్నాక్స్, బ్యాగులు కొనుగోలు చేశారు. గురువారం జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 350 మంది విద్యార్థులకు డీఈవో యాదయ్య చేతుల మీదుగా అంజేశారు. 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదు పారితోషికం అందజేయడంపై ఆంగ్ల ఉపాధ్యాయిని జ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు చౌదరి, సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.